క్లుప్తంగా

రెడ్‌క్రాస్ చేయూత



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఐ.పోలవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి రెడ్‌క్రాస్ అండగా నిలిచింది. కొమరగిరి పంచాయతీ పరిధి లైన్ పేటలో గురువారం మాగాపు అప్పయమ్మకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఢిల్లీ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కోశాధికారి ముదునూరి సతీష్ రాజులు బాధిత కుటుంబానికి 30 కిలోల బియ్యం, హైజనిక్ కిట్, టార్పాలిన్, కూరగాయలు అందించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు చూస్తామన్నారు.

సేవలు అభినందనీయం



పేద విద్యార్థి తల్లికి చెక్కు అందజేస్తున్న డీఆర్‌ఓ సత్తిబాబు

అమలాపురం రూరల్: సేవ్ ద పీపుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. యూకేజీ చదువుతున్న సూర్యవెంకట్ తల్లి మీనాక్షికి ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేలను ఫీజు నిమిత్తం అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సుంకర సుధీర్, సభ్యులు నవ్య, శ్రీకాంత్, లక్ష్మి, నాగదుర్గ, సూర్య, సుమ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



సింహలక్ష్మి (ఫైల్)

అల్లవరం: మొగళ్లమూరులో ఉపాధి పనులు చేస్తున్న బీర సింహలక్ష్మి (51)కి గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. సహచర కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ హుటాహుటిన గోడిలంక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందిందని ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని సర్పంచ్ రాయుడు విష్ణు పరామర్శించారు.

హోంగార్డ్ పోస్టులకు నోటిఫికేషన్

యానాం: పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న హోంగార్డు పోస్టులకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. యానాంలో 25, మాహేలో 37, కారైకల్‌లో 68, పుదుచ్చేరిలో 290 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 29వ తేదీలోగా అర్హులు రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల వినతి

అమలాపురం టౌన్: బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆ ఇళ్లలోని నివాసితులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయానికి టిడ్కో లబ్ధిదారులు వచ్చి సమస్యలు విన్నవించుకున్నారు. డ్రైన్లు, తాగు నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు అభ్యర్థించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజోలు: రోడ్డు ప్రమాదంలో రాజోలు ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఈద ఎజ్రా శాస్త్రి (30) మృతి చెందాడు. రాజోలు పోలీసుల కథనం ప్రకారం.. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన ఎజ్రాశాస్త్రి గురువారం రాత్రి రామరాజులంక నుంచి రాజోలులో అద్దెకు ఉన్న ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. రాజోలు లూథరన్ చర్చి వద్దకు చేరుకునే సరికి బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న బండ రాయిని బలంగా ఢీకొని పక్కనే ఉన్న డ్రైన్ గుంతలో పడిపోయాడు. తెల్లవారే వరకూ ఈ సంఘటనను ఎవరూ గుర్తించకపోవడంతో మురుగు డ్రైన్‌లో ఎజ్రాశాస్త్రి చిక్కుకుపోయి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని డ్రైన్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆస్పత్రికి వచ్చి ఎజ్రాశాస్త్రి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ, సిబ్బంది నివాళులర్పించారు.

నేత్రోదయం

- డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగుతో మేలు
- వేలాది మందికి నేత్ర పరీక్షలు
- అవసరమైన వారికి శస్త్రచికిత్సలు

తాళ్లరేవు: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే నానుడిని ప్రభుత్వం నిజం చేస్తోంది.. అందుకే కంటిని రెప్పలా కాపాడుతోంది.. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేయిస్తుంది. 2018లో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా ఇప్పటివరకూ తాళ్లరేవు మండలంలో 11 వేల మంది అవ్వాతాతలకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి శస్త్రచికిత్సలు చేయించి వెలుగులు నింపారు. వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-1, 2లలో సుమారు 3 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

వెలుగులు నింపాలని..

బీపీ, షుగర్ వంటి వ్యాధులతో పాటు ఆహార అలవాట్లు సక్రమంగా లేక, మద్యపానం, ధూమపానం తదితర వ్యసనాల కారణంగా నూటికి 80 శాతానికి పైగా ప్రజలు నేత్ర సమస్యలతో సతమతమవుతున్నారు. నేత్ర సమస్యలతో ఇబ్బంది పడే చాలామంది అవగాహనా రాహిత్యం, ఆర్థిక పరమైన, ఇతర కారణాలతో చికిత్స చేయించుకోలేక అంధకారంలోనే మగ్గుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో నిపుణులైన నేత్ర వైద్యులతో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

ఎక్కువ మంది వీరే..

పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. ఇందులో వయసుతో సంబంధం లేకుండా అందరికీ ప్రత్యేక నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది. తాళ్లరేవుకు చెందిన నేత్ర వైద్య నిపుణుడు బీరం సత్తిబాబు కంటి సమస్యలున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. తాళ్లరేవు మండలంలో ఇప్పటివరకూ 20కిపైగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించగా సుమారు 3,500 మందిని పరీక్షించి, నేత్ర సమస్యలున్న సుమారు 2 వేల మందికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. సుమారు 50 మందికి కంటి శస్త్రచికిత్సలు చేసేందుకు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రి, కిరణ్ కంటి ఆసుపత్రులకు తరలించారు.



చొల్లంగి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న నేత్ర వైద్య నిపుణుడు



కోరంగి హైస్కూల్‌లో విద్యార్థులకు కళ్లజోళ్ల అందజేత

ఇదో సువర్ణావకాశం



నేత్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సువర్ణావకాశంగా మారింది. ఈ శిబిరంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ పరీక్షించి ఉచితంగా మందులతో పాటు అవసరమైన వారికి కళ్లజోళ్లు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– బీరం సత్తిబాబు, నేత్ర వైద్య నిపుణుడు, తాళ్లరేవు

ప్రభుత్వానికి రుణపడి ఉంటా..



ఎన్నోఏళ్లుగా కళ్లు సరిగా కనిపించక ఇబ్బంది పడుతున్నాను. ఆసుపత్రికి వెళ్లి చూపించుకునే అవకాశం లేక అలాగే జీవితాన్ని వెళ్లదీస్తున్నాను. ప్రభుత్వం మా గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి డాక్టరు చూసి మంచి కళ్లజోడు ఇచ్చారు. ఇప్పుడు నా కళ్లు చాలా బాగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– చెక్కా అప్పాయమ్మ, చినబొడ్డు వెంకటాయపాలెం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయకుమారి

అమలాపురం రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ విజయకుమారి హెచ్చరించారు. ఇందుపల్లిలో బాల్య వివాహం చేస్తున్నారనే సమాచారంతో బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై హెచ్ఎం వి.శ్రీనివాస రావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీలు సుశీల, కె.ఉదయరాణి, ఉపాధ్యాయులు పాల్గొని కౌమార దశ విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

ఉప్పలగుప్తం: చల్లపల్లి, ఎస్.యానం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నివారణకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో ప్రతి పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. హెచ్ఎంలు గరిమెళ్ల స్వామిప్రసాద్, బి.అప్పారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.లీలాకుమారి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొమానపల్లిలో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- కొమానపల్లిలో గడప గడపకూ..

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం కొమానపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలు తెలిపిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కాశి ఇందిర, కాశి రామకృష్ణ, కోలా బాబ్జి, జగతా పద్మనాభం, ఎంపీటీసీ సాధనాల వీరనాగ సుబ్రహ్మణ్యేశ్వరి, నక్కా రామకృష్ణ, బోణం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కొమరగిరిపట్నం సచివాలయం-2 పరిధిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇదే గ్రామంలో రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్ల నుంచి అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, ఆరోగ్య కేంద్రాలు, సీసీ రోడ్లు నిర్మించి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని మంత్రి అన్నారు. సభలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు బొంతు సత్యనారాయణ, కుడుపూడి శ్రీను, బైరిశెట్టి రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్

ఓటు సినిమా విజయోత్సవం

అమలాపురం టౌన్: 'ఓటు' చిత్రం విడుదల సందర్భంగా కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో శుక్రవారం విజయోత్సవం జరిగింది. ఆ చిత్రం ప్రదర్శిస్తున్న స్థానిక శేఖర్ థియేటర్ వద్ద ఆ అసోసియేషన్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్, గౌరవాధ్యక్షుడు గుర్రం రామకృష్ణారావు తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 'ఓటు' చిత్రం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు, కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్‌కు చెందిన దాదాపు 30 మంది నటీనటులకు అవకాశం కల్పించినందుకు రమణలాల్ ఆనందం వ్యక్తం చేశారు. చిత్ర దర్శకుడు, నిర్మాతలు కోనసీమ ప్రాంతంలో దాదాపు 80 శాతం చిత్రాన్ని నిర్మించడమే కాకుండా ఈ ప్రాంత నటీనటులకు అవకాశం కల్పించినందుకు అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు, సినీ ఆర్టిస్టులు రవీంద్రనాయుడు, భద్రాజీ, కుమార్, త్రిమూర్తులు, ఓటు చిత్రం అసిస్టెంట్ డైరెక్టర్ నాని క్రిష్టియన్ పాల్గొన్నారు.



'ఓటు' చిత్ర విజయోత్సవంలో కోనసీమ ఫిల్మ్ అసోసియేషన్ ప్రతినిధులు, సినీ ఆర్టిస్టులు

కాట్రేనికోన ఎస్సైగా నాగేశ్వరరావు

కాట్రేనికోన: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై టి.శ్రీనివాస్ ఎస్‌బీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం చట్టరీత్యానేరమని, ఆకతాయిల ఆట కట్టించేందుకు పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అల్లవరం: స్వాతంత్య్ర ఉద్యమంలో ఖాదీ పాత్ర, చేనేత, హస్తకళలతో భారతీయుల జీవన విధానంపై అల్లవరం మండల రిసోర్సు కార్యాలయంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఎంఈఓ-2 ఏడుకొండలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సమన్వయంతో సాగండి

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పట్టణ అభివృద్ధికి అంతా సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పట్టణంలో కుళాయిల నుంచి మురుగు నీరు రాకుండా చేసేందుకు వాటర్ వర్క్స్‌లో తాగునీటి శుద్ధీకరణ (క్లారిఫై) పేరుతో వెచ్చించిన రూ.35 లక్షల పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సమాధానమిస్తూ తాము క్లారిఫై పనులు సక్రమంగా చేశామని చెప్పారు. పనులలో అక్రమాలను వెలికి తీసేందుకు క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లచే తనిఖీలు చేయించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేస్తూ తీర్మానం చేయాలని చైర్‌పర్సన్‌కి సూచించారు. అన్ని వార్డుల్లోనూ పార్కుల అభివృద్ధి చేయాలన్నారు. పట్టణ పేదలకు బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయంలో సౌకర్యాలు లేవంటూ టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి అడగ్గా పాలకపక్ష కౌన్సిలర్ సంసాని బులినాని దీటైన జవాబిచ్చారు. టిడ్కో ఇళ్లు టీడీపీ ప్రభుత్వంలోనే అరకొర సౌకర్యాలతో నిర్మించారని ధ్వజమెత్తారు. ఈ వాగ్వాదంలో కౌన్సిలర్ చంటి పాలకపక్షాన్ని ఏకవచనంతో మాట్లాడడంతో పాలకపక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అదేస్థాయిలో బదులిచ్చారు. 12వ వార్డులో ఎంపీ లాడ్స్ రూ.15 లక్షలతో ఓ పని చేపడుతున్నట్లు అజెండాలో పేర్కొన్న అంశంపై పాలకపక్షం కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ అధికారులను ప్రశ్నించారు. ఆ వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు లేచి తన వార్డులో ఈ పని చేస్తున్నట్లు తనకు తెలియదన్నారు. తన వార్డులో ప్రభుత్వ భూములు, డ్రైన్లను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయని 25వ వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తాగునీటి శుద్ధీకరణ పనులపై నిలదీస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

స్వామియే శరణం అయ్యప్ప

- భక్తిశ్రద్ధలతో కలశపూజ
- భారీగా తరలివచ్చిన స్వాములు

ముమ్మిడివరం: స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోష ఆ ప్రాంతంలో మార్మోగింది.. శుక్రవారం గాడిలంకలో అయ్యప్పస్వామి కలశ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి యోగేశ్వర సురేష్‌స్వామి ఆధ్వర్యంలో 18 కలశలతో ఈ పూజ చేశారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు తరలివచ్చి స్వామిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అమలాపురానికి చెందిన కోన గురుస్వామి ఆధ్వర్యంలో కలశ పూజ జరిగింది. గిరిగి కోదండపాని గురుస్వామి ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఉదయం గణపతి, అష్టభైరవ, చండీ, ప్రత్యంగిర హోమాలు జరిగాయి. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పెన్మత్స జగ్గప్పరాజు గురుస్వామి పాల్గొన్నారు.



గాడిలంకలో అయ్యప్ప కలశ పూజ చేస్తున్న స్వాములు

పత్తిగొందిలో అన్నసమారాధన

తాళ్లరేవు: దసరా నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలు ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానాన్ని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

యానాం: యానాం నియోజకవర్గానికి సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను శుక్రవారం వివిధ రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఆర్‌ఏఓ మునిస్వామి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 9లోగా డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాలను తెలపవచ్చని అన్నారు. జనవరి 5న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. నాయకులు మల్లాడి శామ్యూల్, కనకాల రాజు, బాషా, అర్థాని దినేష్ పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

యానాం: దరియాలతిప్పలో పంట పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వద్ద శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంట పొలాలకు నీరు అందకపోతే ఎండిపోయే పరిస్థితి వస్తుందన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అశోక్ శివారు ప్రాంతాల్లోని పంట పొలాలను పరిశీలించారు. అనంతరం పీడబ్ల్యూడీ అధికారులతో చర్చించి సాగునీటిని సక్రమంగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆంధ్ర ప్రాంత సాగునీటి అధికారులతో సైతం మాట్లాడారు. రైతులు మెల్లం శ్రీనివాసరావు, లోకేష్ తదితరులు ఉన్నారు.



యానాం ఎమ్మెల్యే అశోక్‌కు సాగునీటి సమస్యలను వివరిస్తున్న రైతులు

నేడు వెంకన్న ఆలయం మూసివేత

అమలాపురం టౌన్: చంద్ర గ్రహణం సందర్భంగా అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం 1.04 గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. ఆలయాన్ని తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 8.15 గంటలకు తెరిచి స్వామి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

31న మండల పరిషత్ సమావేశం

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో ఉదయం 10 గంటలకు ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. దీనికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని అన్నారు.

మీ ఆరోగ్యం.. మా బాధ్యత



గోడిలో జగనన్న ఆరోగ్య సురక్ష సభలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



చినబొడ్డు వెంకటాయపాలెంలో మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్ తదితరులు



టి.కొత్తపల్లి-1 సచివాలయం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

- మంత్రి పినిపే విశ్వరూప్
- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అల్లవరం: ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గోడి సచివాలయ భవనంలో సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ విచ్చేశారు. మంత్రి మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించే దిశగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ కాండ్రేగుల వాణి, నాయకులు కొనుకు బాపూజీ, తిక్కా ప్రసాద్, దొమ్మేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెంలో సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన సురక్ష శిబిరాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొపనాతి లలిత ప్రారంభించారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులతో పాటు ఐదుగురు నిపుణుల బృందం 400 మందికి పరీక్షలు చేసింది. నేత్ర వైద్య నిపుణుడు సత్తిబాబు సుమారు 80 మందికి నేత్ర పరీక్షలు చేశారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి పి.రామరాజు, ఎంపీటీసీ పాలెపు పోశియ్య పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. టి.కొత్తపల్లి-1 సచివాలయం పరిధిలో తహసీల్దార్ యూనిస్ కుమారి ఆధ్వర్యంలో సర్పంచ్ పండు నళిని అధ్యక్షతన సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.ఆదిత్యపవన్, ఇందిరాశ్రీ, వినయ్‌కుమార్, కేజీయాలు పరీక్షలు చేశారు. 101 మందికి కంటి, 254 మందికి ల్యాబ్ టెస్టులు, 615 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, వడ్డి గౌతమ్, పండు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: సాకుర్రులో సచివాలయం-1 పరిధిలో ఉన్నత పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్ గుత్తుల చిరంజీవి ప్రారంభించారు. ఈఓపీఆర్డీ గుబ్బల మల్లికార్జున రావు, కార్యదర్శి రమాశైలజ, వైద్యులు ములపర్తి శాంతిలక్ష్మి, వాసునాయక్, సాహితీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.